


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA

RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 16.05.2026 | సంపుటి: 3 | సంచిక: 104 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 16.05.2026 | VOLUME : 3 | ISSUE : 104 | PAGES: 8 | COST: 2/- |


## క్యాన్సర్ రహిత తెలంగాణే లక్ష్యం

- 'క్యాన్సర్ అట్లాస్' కీలక ఆయుధం: సీఎం రేవంత్ రెడ్డి
- ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్క్రీనింగ్ సెంటర్లు
- జిల్లాల్లోనే ప్రత్యేక క్యాన్సర్ ఆస్పత్రుల ఏర్పాటు
- ఆరోగ్యశ్రీ కింద చికిత్సను మరింత బలోపేతం చేస్తాం



2



## ఆర్టీసీ విలీన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

- 'అపాయింటెడ్ డేట్' ప్రకటించాలని జేఏసీ విజ్ఞప్తి
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ
- 2021 వేతన సవరణ వేగవంతం చేయాలని ఆదేశాలు
- త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలవనున్న జేఏసీ

2



### భారీ స్థాయిలో కార్యాలయాల విస్తరణ

# హైదరాబాద్‌పై గ్లోబల్ కంపెనీల ఫోకస్

- ఉబెర్ భారీ లీజు ఒప్పందం
- 10 ఏళ్లకు రూ.839 కోట్ల అద్దె
- హైదరాబాద్‌లో కార్యకలాపాల విస్తరణకు ఆసక్తి
- పెట్టుబడులకు ఆకర్షణగా మారుతున్న తెలంగాణ

**హైదరాబాద్, మే15(రాజముద్ర న్యూస్) :** హైదరాబాద్ నగరం అంతర్జాతీయ కంపెనీలకు ప్రధాన వ్యాపార కేంద్రంగా వేగంగా ఎదుగుతోంది. ప్రపంచ స్థాయి టెక్నాలజీ సంస్థలు తమ కార్యాలయాల విస్తరణకు భాగ్యనగరాన్ని ఎంపిక చేసుకుంటుండటంతో నగర రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త ఊపు కనిపిస్తోంది. ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు భారీ స్థాయిలో కార్యాలయ స్థలాలను లీజుకు తీసుకోగా, తాజాగా ఉబెర్ కూడా ఆ జాబితాలో చేరింది. రైడ్ సేవల సంస్థ ఉబెర్ హైదరాబాద్‌లో ఏకంగా 9 లక్షల చదరపు అడుగులకు పైగా ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకుంది. మీనాక్షి ఎకో పార్క్ టవర్-1లో

మిగతా 2వ పేజీలో..

## దొంగ ఓట్లతోనే బీజేపీ నేతలు గెలిచారు"

- ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్

2



## రూ.1.21 లక్షల కోట్లు ఖర్చు చేసినా నీళ్లు ఎందుకు రాలేదు"

- పాలమూరు–కాళేశ్వరం ప్రాజెక్టులపై కవిత విమర్శలు



2

## పట్టణాల్లో భారీ సీవరేజ్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

- 101 యూఎల్‌బీల్లో రూ.3705 కోట్ల పనులకు అనుమతి




2

## పెట్రో ధరల పెంపు అనివార్యం

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి పనీపాటలేని విమర్శలు

- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

2




## విపత్తులను ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నాహాలు

- 47 శాఖల అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశం
- రాష్ట్రవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహణకు నిర్ణయం
- ఆపద సమయంలో సమన్వయంతో పనిచేయాలని సూచనలు
- ఆపద మిత్ర వాలంటీర్లకు ఘన సత్కారం

**హైదరాబాద్, మే 15 (రాజముద్ర న్యూస్):** అకస్మాత్తుగా వచ్చే వరదలు, అడవుల్లో మంటలు, ఫ్యాక్టరీ ప్రమాదాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను ఎలా నివారించాలనే అంశంపై శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 47 శాఖల అధికారులు పాల్గొన్నారు.
విపత్తులు సంభవించిన

మిగతా 3వ పేజీలో..

## బండి భగీరథ్ పోక్సో కేసు

- సోషల్ మీడియాలో బాధిత బాలిక వివరాల ప్రచారం
- గోప్యతకు భంగం కలిగించడంపై పోలీసుల కేసులు



**హైదరాబాద్, మే 15 (రాజముద్ర న్యూస్):** బండి భగీరథ్ పోక్సో కేసు మరో కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రుల ఫోటోలు, వీడియోలు వైరల్ చేసిన సోషల్ మీడియా నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లోని కొన్ని ఛానళ్లు బాధిత కుటుంబం వివరాలు బహిర్గతమయ్యేలా ఫోటోలు, వీడియోలు ప్రసారం చేశాయి. ఇవి వైరల్‌గా

మిగతా 3వ పేజీలో..



## పరువు నష్టం కలిగించేలా వార్తల ప్రసారం

- సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్

**హైదరాబాద్, మే 15 (రాజముద్ర న్యూస్):** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. తనపై మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్‌లో పరువు నష్టం కలిగించేలా వార్తలు ప్రసారం చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడు భగీరథ్ పోక్సో కేసుతో పాటు తనపైనా దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో

మిగతా 2వ పేజీలో..

## పేదల నడ్డి విరుస్తున్న బీజేపీ సర్కార్

- ఎన్నికల తర్వాతే వసూళ్ల పర్వం
- ఓటర్లను తప్పుదోవ పట్టించి ఇప్పుడు భారం మోపడం సరికాదు
- నేషనల్ లీకేజీ ఏజెన్సీగా 'నీట్'
- 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
- ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడే | నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు
- చట్టం తన పని తాను చేసుకుపోతుంది..
- బీఆర్ఎస్‌లా చట్టాలను చుట్టాలుగా చేసుకోం
- మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం

**సంగారెడ్డి, మే 15 (రాజముద్ర న్యూస్):** నాలుగు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగియగానే బీజేపీ ప్రభుత్వం తన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని, పెట్రో ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తూ వసూళ్ల పర్వానికి తెరలేపిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ధ్వజమెత్తారు. సంగారెడ్డిలోని నిర్మల జగ్గారెడ్డి నివాసంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిలతో

మిగతా 2వ పేజీలో..





## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జూన్ 2లోపే ఆరోగ్య కార్డులు ఇవ్వండి: సీఎస్‌ను కోరిన టీజేఏసీ

3

## హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు



- రైల్వేశాఖతో కలసి ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులను ఆదేశించిన సీఎస్ రామ కృష్ణారావు

**హైదరాబాద్, మే 15 (రాజముద్ర న్యూస్):** హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్ర భుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు అధికారులను ఆదేశించారు.

మిగతా 2వ పేజీలో..

## పట్టణాల్లో భారీ సీవరేజ్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, మే15:**

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం భారీ సీవరేజ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. తెలంగాణలో 101 యూఎల్‌బీల్లో చేపట్టనున్న ప్రాజెక్టులకు రూ.3705.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద ఈ ప్రాజెక్టులకు టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించింది. ప్రాజెక్టులను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

మొత్తం 101 పట్టణాలను మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవనున్నారు. దీనివల్ల పెద్ద కంపెనీలు పోటీలో పాల్గొనే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

సాధారణంగా భూసేకరణ పూర్తైన తర్వాతే టెండర్లు పిలుస్తారు. అయితే ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఎక్కువగా ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ పెండింగ్‌లో ఉన్నా టెండర్ ప్రక్రియను నిలిపివేయొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని స్పష్టం చేసింది.

ప్రాజెక్టుల కింద డ్రైనేజీ నెట్‌వర్క్, ఎస్టీపీల నిర్మాణంతో పాటు వాటి నిర్వహణ బాధ్యతలను కూడా నిర్మాణ సంస్థలకే అప్పగించనున్నారు. ఐదేళ్లపాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది.

గతంలో ప్రాజెక్టు వ్యయాన్ని రూ.3769.34 కోట్లుగా అంచనా వేయగా, సమీక్ష అనంతరం రూ.3705.75 కోట్లకు తగ్గించి పరిపాలనా అనుమతులు ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేశారు. టెండర్లలో ఎక్కువ సంఖ్యలో బిడ్డర్లు పాల్గొనేలా ప్రీబిడ్ సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టులు పూర్తైతే పట్టణాల్లో పారిశుధ్య ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు భూగర్భ జలాల కాలుష్యాన్ని తగ్గించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## పెట్రో ధరల పెంపు అనివార్యం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి పనీపాటలేని విమర్శలు

**హైదరాబాద్, మే 15:**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకుంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆయా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు అనివార్యమైందన్నారు. అంతేకానీ ఇది ప్రజలపై భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

## క్యాన్సర్ రహిత తెలంగాణే లక్ష్యం

**తెలంగాణ బ్యూరో,మే 15 :**

రాష్ట్రంలో క్యాన్సర్ రహిత సమాజం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పోరాటంలో 'క్యాన్సర్ అట్లాస్' ఒక శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడుతుందని తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయ ముఖ్యమంత్రిని కలిసి తెలంగాణలో క్యాన్సర్ వ్యాధి స్థితిగతులపై రూపొందించిన సమగ్ర నివేదికను అందజేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో క్యాన్సర్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించేందుకు ఈ అట్లాస్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. వ్యాధి వ్యాప్తి మాత్రమే కాకుండా, ఆయా ప్రాంతాల్లో క్యాన్సర్ అధికంగా ఉండటానికి గల కారణాలను గుర్తించడంలో కూడా ఈ నివేదిక దోహదపడుతుందని పేర్కొన్నారు.

అట్లాస్‌లో వెల్లడైన గణాంకాల ఆధారంగా క్యాన్సర్ ముప్పు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి రక్షించే అవకాశం ఉంటుందని చెప్పారు.

క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితిని మార్చాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. బాధితులు అధికంగా ఉన్న జిల్లాల్లో ప్రత్యేక క్యాన్సర్ ఆస్పత్రులు నిర్మించి పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో క్యాన్సర్ చికిత్సను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలని అధికారులను ఆదేశించినట్లు సీఎం తెలిపారు. సమగ్ర నివేదికను అందించిన డాక్టర్ నోరి దత్తాత్రేయను సీఎం అభినందించారు.

కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చోంగ్థూ పాల్గొన్నారు

## పరువు నష్టం కలిగించేలా వార్తల ప్రసారం

**మొదటిపేజీ తరువాయి**



తన పేరు, ఫొటోలు, వీడియోలు వాడొద్దంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పేరుతో ఇప్పటివరకు సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానళ్లలో ఉన్న వీడియోలను తొలగించాలని కోర్టును బండి సంజయ్ కోరారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా ప్రచారం జరుగుతోందని న్యాయస్థానానికి బండి సంజయ్ వివరించారు. ఈ క్రమంలో సోషల్ మీడియా, యూట్యూబ్, మీడియాలో బండి సంజయ్‌పై వచ్చిన కథనాలను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాల వరకు ఎలాంటి కథనాలు ప్రసారం చేయొద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. యూట్యూబ్, సోషల్ మీడియాలో బండి సంజయ్‌కు వ్యతిరేకంగా ఉన్న పోస్టులను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది

# దొంగ ఓట్లతోనే బీజేపీ నేతలు గెలిచారు

**హైదరాబాద్, మే 15:**

"తెలంగాణలో బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతోనే గెలిచారు" అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. 14 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ఓట్ల జోరీ జరిగిందని, బెంగాల్ ఎన్నికలే ఇందుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికలు లేనందున ఎస్ఐఆర్ ప్రక్రియను ఏడాది పొడవున నిర్వహించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ మూడో దశ నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో శుక్రవారం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరిగే ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎస్ఈసీకి వినతిపత్రం అందజేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్ ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని కోరినట్లు తెలిపారు. గత 25 ఏళ్లలో ఓటర్ల సంఖ్య 1.2 కోట్లు పెరిగిందని, ఈ ప్రక్రియను తొందరపాటు లేకుండా ఒకటిన్నర నుంచి రెండేళ్ల పాటు దశలవారీగా నిర్వహించాలని సూచించారు.

జనాభా గణన, ఎస్ఐఆర్ విధులను వేర్వేరుగా నిర్వహించాలని, ఒకే అధికారికి రెండు బాధ్యతలు అప్పగించకూడదన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు 2002, 2025 నాటి ఓటర్ల జాబితాలను సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ రూపంలో అందించాలని కోరారు.

ఓటర్లపై అభ్యంతరాలు, నోటీసులకు కనీసం నెల రోజుల గడువు ఇవ్వాలని, ఓటు తొలగించే ముందు తప్పనిసరిగా ఏడు రోజుల ముందస్తు వ్రాతపూర్వక నోటీసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఎల్ఓలు జియో ట్యాగ్ ఫొటోలతో కనీసం మూడు సార్లు గృహ సందర్శనలు నిర్వహించాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ తప్పిదాల ఆధారంగా కాకుండా భౌతిక ధృవీకరణ తర్వాతే మార్పులు చేయాలని కోరారు.

ధృవీకరణకు ముందే అన్ని బూత్‌లలో బీఎల్ఏల నియామకం పూర్తి చేసి వారికి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఫారమ్ 7 ద్వారా ఓట్ల బల్క్ తొలగింపులను కఠినంగా అరికట్టాలని, ఏఎస్‌డీ జాబితాలను రాజకీయ పార్టీలకు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఈఆర్ఓ, డీఈఓ స్థాయిల్లో ఐదేళ్ల పాటు భద్రపరచాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, పేద వర్గాల ఓట్లు తొలగిపోకుండా ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు.

2002 తర్వాత తెలంగాణకు వలస వచ్చి కనీసం రెండు ఎన్నికల్లో ఓటు వేసిన వారికి అఫిడవిట్ ఆధారంగా ఓటు హక్కు కల్పించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి, నోటీసులు ఇవ్వకుండా ఓట్లు తొలగించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు రైల్వేశాఖతో కలసి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుంచి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సీఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హైస్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సీఎస్ తెలిపారు. హైదరాబాద్, పుణే, ముంబై హైస్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డీపీఆర్ సిద్ధమైందని రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 671 కి.మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి.మీటర్ల మేర భూసేకరణ అవసరం ఉంటుందని, అదే విధంగా హైదరాబాద్‌బెంగళూరు కారిడార్, హైదరాబాద్‌చెన్నై కారిడార్‌లో సుమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాల్లో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్ఎండీఏ, జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హైస్పీడ్ రైలు ప్రాజెక్టుకు సహకరించాలని సీఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ విలీన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

**హైదరాబాద్, మే 15:**

ఆర్టీసీ సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్ల మేరకు విలీన ప్రక్రియను తక్షణమే పూర్తి చేసి 'అపాయింటెడ్ డేట్' ప్రకటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జేఏసీ ప్రతినిధులు కలిసి తమ డిమాండ్లను వినిపించారు. విలీన ప్రక్రియలో జేఏసీ సూచించిన విధివిధానాలను పరిగణనలోకి తీసుకోవాలని, ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్.. సమ్మె చర్చల సమయంలో మంత్రుల కమిటీ, ఐఏఎస్ అధికారుల కమిటీతో కార్మిక సంఘాలు చర్చించి అంగీకరించిన అంశాలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. విలీనం అంశాన్ని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 2021 వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే అన్ని డిపోల్లో అధికారులు కార్మిక సంఘాలతో స్నేహపూర్వక వాతావరణంలో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మంత్రితో భేటీ అనంతరం జేఏసీ నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. విలీన ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని కోరుతూ త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్‌పై గ్లోబల్ కంపెనీల ఫోకస్

**మొదటిపేజీ తరువాయి**

ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ఒప్పందం 2026 జనవరి 9 నుంచి అమల్లోకి రానుండగా, పదేళ్లపాటు కొనసాగనుంది. మొత్తం అద్దె విలువ సుమారు రూ.839 కోట్లుగా ఉండనున్నట్లు సమాచారం.

నెలకు సుమారు రూ.5.86 కోట్ల అద్దె చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. చదరపు అడుగుకు రూ.65 చొప్పున అద్దె నిర్ణయించగా, ప్రతి మూడు సంవత్సరాలకు 15 శాతం పెంపు ఉండనుంది. దీనికోసం ఉబెర్ రూ.35 కోట్లకు పైగా సెక్యూరిటీ డిపాజిట్ కూడా చెల్లించినట్లు సమాచారం.

హైదరాబాద్‌లో ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలు తమ కార్యకలాపాలను విస్తరించాయి. నెట్‌ఫ్లిక్స్, మెటా, యాపిల్ వంటి కంపెనీలు కూడా భారీ స్థాయిలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో ఐటీ, కార్పొరేట్ రంగాల్లో హైదరాబాద్ ప్రాధాన్యం మరింత పెరుగుతోంది.

ఇటీవల ఉబెర్ సీఈఓ దారా ఖోస్రోషాహి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మరింత విస్తరించాలని సంస్థ భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని వెల్లడించారు.

భవిష్యత్తులో తెలంగాణలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించాలని ఉబెర్ యోచిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఫ్యూచర్ సిటీలో కూడా కార్పొరేట్ కార్యాలయం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

## రూ.1.21 లక్షల కోట్లు ఖర్చు చేసినా నీళ్లు ఎందుకు రాలేదు

- **పాలమూరు–కాళేశ్వరం ప్రాజెక్టులపై కవిత విమర్శలు**

**హైదరాబాద్, మే 15:**

"పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులపై రూ.1.21 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా ప్రజలకు ఎందుకు నీళ్లు రాలేదు" అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. శుక్రవారం ఓ మీడియా సంస్థ నిర్వహించిన కాన్క్లేవ్‌లో మాట్లాడిన ఆమె గత బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 30 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి పదేళ్లు గడిచినా చుక్కనీరు ఇవ్వలేకపోయారని దుయ్యబట్టారు. రూ.32 వేల కోట్ల అంచనాలతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.80 వేల కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. నీటి వినియోగంలో తెలంగాణ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణలోనే అతిపెద్ద జిల్లా అయినప్పటికీ ఇప్పటికీ వలసలు కొనసాగుతున్నాయని కవిత అన్నారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా ప్రజల పరిస్థితిలో మార్పు రాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

"ఈ దేశంలో ఏ మార్పు వచ్చినా అది రాజకీయాల ద్వారానే వచ్చింది" అని కవిత వ్యాఖ్యానించారు. దేశంలోని సమస్యలపై స్పందించేది రాజకీయ నాయకులేనని, యువతను రాజకీయాలకు దూరంగా ఉంచుతున్నారని విమర్శించారు. నేపాల్‌లో జెన్ జీ ప్రభుత్వం మార్చివేసిందని గుర్తుచేశారు.

మాతో కలిసి కలవండి అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ వీళ్లు ఎప్పటి నుంచో కలిసి ఉన్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ సీఎం అని తాము ముందే చెప్పామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టుల విషయంలో కేంద్రాన్ని ప్రశ్నించడం లేదని విమర్శించారు.

# పేదల నడ్డి విరుస్తున్న బీజేపీ సర్కార్

**మొదటిపేజీ తరువాయి**



కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనాన్ని ప్రజలకు అందించని కేంద్రం, ఇప్పుడు అకస్మాత్తుగా పెట్రోల్ ధరలను మూడు రూపాయలు పెంచడం దుర్మార్గమని విమర్శించారు. బెంగాల్, తమిళనాడు ఎన్నికల సమయంలో ధరలు పెరగవని చెప్పి ఓటర్లను తప్పుదోవ పట్టించారని, తీరా ఓట్లు పడ్డాక భారం మోపడం బీజేపీ కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల బాగు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంటే, ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే బీజేపీ ఏకైక లక్ష్యంగా మారిందని మంత్రి ఎద్దేవా చేశారు.

**రైతులపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు**

ధాన్యం కొనుగోళ్ల విషయంలో బీఆర్ఎస్ చేస్తోన్న ఆందోళనలపై మంత్రి ఘాటుగా స్పందించారు. గతంలో తరుగు పేరిట రైతులను నిలువునా ముంచిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదేనని, వారికి రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యం మార్కెట్‌కు వచ్చిందని, లారీలు రావడం కొన్ని సందర్భాల్లో ఆలస్యమైనా దాన్ని అదనుగా తీసుకుని రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ప్రతి రెండు రోజులకు ఒకసారి సమీక్ష చేస్తున్నారని, రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు.

**నీట్ ఎగ్జామ్ నేషనల్ లీకేజీ ఏజెన్సీగా మారింది**

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నీట్ పరీక్షా పేపర్ల లీకేజీపై మంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నీట్ ఏజెన్సీ కాస్తా 'నేషనల్ లీకేజీ ఏజెన్సీ'గా మారిందని, సుమారు 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆడుకుంటోందని ఆరోపించారు. ఏళ్ల తరబడి కష్టపడి చదివిన విద్యార్థులకు కేంద్రం సమాధానం చెప్పాలని, ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**సమిష్టి నిర్ణయాలతోనే పాలన**

రాష్ట్ర ప్రభుత్వ పాలనపై స్పందిస్తూ.. సీఎం, మంత్రులం అందరం కలిసికట్టుగా నిర్ణయాలు తీసుకుంటున్నామని, కాలుష్య నివారణ కోసమే హిల్ట్ పాలసీని తీసుకువచ్చామని మంత్రి వివరించారు. రాహుల్ గాంధీ ఆశయాల మేరకు అన్ని వర్గాల ప్రజలు స్నేహపూర్వకంగా ఉండాలని తాము కోరుకుంటున్నామని, తెలంగాణ విజ్ఞానవంతుల భూమి అని, ఇక్కడ బీజేపీ విభజన రాజకీయాలు సాగవని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలా చట్టాలను చుట్టాలుగా మార్చుకునే అలవాటు తమకు లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## విపత్తులను ఎదుర్కొనేందుకు
# ముందస్తు సన్నాహాలు

**మొదటిపేజీ తరువాయి**

సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, రెస్క్యూ ఆపరేషన్ల నిర్వహణపై అధికారులు చర్చించారు. ఎన్డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహ్ల్ గ్రౌండ్ లెవల్‌లో చేపట్టాల్సిన సహాయక చర్యలను అధికారులకు వివరించారు.
ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, జిల్లా అధికారులు, కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గాయపడిన వారిని వేగంగా తరలించడం, సమాచారాన్ని తక్షణమే పంచుకోవడం వంటి అంశాలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని కీలక ప్రాంతాల్లో భారీ స్థాయిలో మాక్ డ్రిల్స్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ డ్రిల్స్ ద్వారా లోపాలను ముందుగానే గుర్తించి సరిదిద్దుకోవచ్చని అధికారులు తెలిపారు. దీంతో నిజమైన ప్రమాదాల సమయంలో ప్రాణ నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఆపద సమయంలో ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ప్రజలకు సేవలందిస్తున్న యువ ఆపద మిత్ర వాలంటీర్లను కార్యక్రమంలో శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెక్రటరీ హరిచందన దాసరి తదితరులు పాల్గొన్నారు.

# పర్సంటేజీ విధానంపై కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, మే 15 :**

తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతలు మరియు థియేటర్ ఎగ్జిబిటర్ల మధ్య సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో తెలుగు తెలంగాణ ఫిలిం ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజ్ విధానంపై కమిటీ ఏర్పాటు చేసింది. 15 మందితో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్, నిర్మాతలకు చోటు కల్పించింది. కమిటీలో ఒక్కో విభాగం నుంచి ఐదుగురుని నియమించారు. 2 నెలల్లో నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచించారు. నిర్మాతలు మరియు థియేటర్ ఎగ్జిబిటర్ల మధ్య పర్సంటేజ్ వివాదం తలెత్తడంతో ఈ సమస్యల పరిష్కారానికి తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ రంగంలోకి దిగింది. ఛాంబర్ అధ్యక్షుడు డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో ఇవాళ ఇరు వర్గాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వాడీవేడీగా జరిగిన ఈ సమావేశంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# బండి భగీరథ్ పోక్సో కేసు

**మొదటిపేజీ తరువాయి**

మారడంతో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలిక, ఆమె కుటుంబ వివరాలు బయటపెట్టిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ అకౌంట్లను గుర్తించి సంబంధిత యూఆర్ఎల్‌లను ఉన్నతాధికారులకు పంపించారు. ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకునేందుకు రంగంలోకి దిగారు. బాధితురాలి గోప్యతకు భంగం కలిగిస్తే శిక్ష తప్పదంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులను షేర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జవహర్‌నగర్ దోపిడీ కేసులో పురోగతి

- **ప్రధాన నిందితులను పట్టుకున్న పోలీసులు**

**హైదరాబాద్, మే 15:**

జవహర్‌నగర్ నేపాలీ ముఠా దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మమత అలియాస్ మీనా కడాయత్, ఆమె భర్త రమేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ సరిహద్దుల్లో ఈ దంపతులు అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో నలుగురి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చోరీ జరిగిన రోజు యజమాని ద్విచక్ర వాహనాన్ని తీసుకుని దుండగులు పరారయ్యారు. ఆ బైక్‌ను యాప్రాల్‌లోని పెట్రోల్ బంకు వద్ద వదిలి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఏజెంట్ భీమ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన నిందితులను రేపటిలోగా హైదరాబాద్‌కు తరలించనున్నట్లు సమాచారం. అలాగే ఈ కేసులో మిగిలిన నిందితులు నేపాల్‌లో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ దంపతులను బంధించి నేపాలీ ముఠా దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో దుండగులు పరారయ్యారు. ఈ దోపిడీపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




## చిరుజల్లులతో నగరవాసులకు ఉపశమనం

**హైదరాబాద్, మే 15:**

గత కొద్దిరోజులుగా మండుతున్న ఎండలతో ఉక్కపోతకు గురైన ప్రజలకు శుక్రవారం సాయంత్రం కురిసిన చిరుజల్లులు కొంత ఉపశమనం కలిగించాయి. పెరిగిన ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న స్థానికులకు వర్షంతో చల్లని వాతావరణం ఏర్పడింది. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకోవడంతో అంబర్‌పేట పరిసర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోజంతా ఉన్న వేడి తీవ్రత తగ్గి వాతావరణం చల్లబడింది. ఎండలతో అలసిపోయిన ప్రజలు ఈ వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే సాయంత్రం సమయంలో కురిసిన వర్షం కారణంగా రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రధాన రహదారులపై స్వల్పంగా వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఇళ్లకు బయలుదేరిన ఆఫీసు సిబ్బంది ట్రాఫిక్ సమస్యలతో అవస్థలు పడ్డారు. పిల్లలు, యువత వర్షాన్ని ఆస్వాదిస్తుండగా, వ్యాపారులు మాత్రం ఆకస్మిక వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఉష్ణోగ్రతలు కొంత మేర తగ్గే అవకాశముందని అధికారులు చెప్పారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**హైదరాబాద్, మే15:**

రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ జూన్ 2లోపు ఆరోగ్య కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ ఏొద్నాల రాజశేఖర్ కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను విడుదల చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, జూన్ 2కు ముందే రెండో పీఆర్సీ అమలు చేయాలని కోరారు.
శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు దృష్టికి ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్లారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా నగదు రహిత వైద్యం తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.
రెవెన్యూ శాఖలో 61 సంవత్సరాలు దాటిన వీఆర్ఏల చట్టబద్ధ వారసులైన కుమారులు, కుమార్తెలను నియమించాలని కోరారు. తొలగించిన 632 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, ఎఫ్‌టీఎస్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని, రెవెన్యూ శాఖలో ధరణి ఆపరేటర్ల సేవలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.
సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు హన్మంతరావు, డి.భాస్కర్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, జీపీఓ అసోసియేషన్ అధ్యక్షుడు గరిక ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

# బాలిక వివరాలు ప్రసారం చేస్తే కఠిన చర్యలు

- **పోక్సో కేసులో సోషల్ మీడియా ఖాతాలపై కేసులు**

**హైదరాబాద్, మే15:**

బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో బాలిక వివరాలను సోషల్ మీడియాలో ప్రసారం చేసిన వారిపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. బాలిక ఫోటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాలను సోషల్ మీడియాలో ప్రచారం చేసిన నిర్వాహకులపై చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు జువెనైల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 74 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మైనర్ల గుర్తింపును బహిర్గతం చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు.బాలిక, ఆమె కుటుంబ సభ్యుల వివరాలు బయటకు వచ్చేలా కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల ఐడీలు, సంబంధిత URLల ఆధారంగా ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యల కోసం సంబంధిత అధికారులకు వివరాలు పంపినట్లు వెల్లడించారు.
పోక్సో కేసుల్లో బాధితులుగా ఉన్న మైనర్ పిల్లల వివరాలు, ఫోటోలను ఎలాంటి పరిస్థితుల్లోనూ బయటపెట్టొద్దని పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి చర్యల వల్ల బాధితులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక వేదనకు గురవుతారని తెలిపారు.
బాధితురాలి గుర్తింపుకు సంబంధించిన సమాచారం, ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయొద్దని సైబరాబాద్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



## 32 ఏళ్లుగా ఒకే వెయిట్

- **డీజీపీ సీవీ ఆనంద్ ఫిట్‌నెస్ సీక్రెట్ ఇదే**

**హైదరాబాద్, మే15:**

తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తన ఫిట్‌నెస్ రహస్యాన్ని వెల్లడించారు. శుక్రవారం నిర్వహించిన ఓ మీడియా కాన్క్లేవ్‌లో పాల్గొన్న ఆయన, గత 32 ఏళ్లుగా తాను 75 నుంచి 76 కిలోల బరువును కొనసాగిస్తున్నానని తెలిపారు.
క్రమశిక్షణతో కూడిన ఆహారపు అలవాట్ల వల్లే ఇది సాధ్యమైందన్నారు. ముఖ్యంగా చక్కెర, ఉప్పు, రైస్, మైదా వంటి పదార్థాలను ఆహారం నుంచి దూరం పెట్టినట్లు చెప్పారు. వాటిని నియంత్రించడం వల్లే ఈ వయసులో కూడా ఫిట్‌గా ఉండగలుగుతున్నానని పేర్కొన్నారు.
పోలీసు శాఖలో పనిచేసే వారికి ఫిట్‌నెస్ అత్యంత అవసరమని డీజీపీ తెలిపారు. సరైన ఆహార నియమాలు పాటిస్తే దీర్ఘకాలిక అనారోగ్యాల నుంచి దూరంగా ఉండవచ్చని సూచించారు.
ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండే పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు.

# కుల కార్పొరేషన్లకు నిధులు, విధులు

- **పెరిక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, మే 15 :**

కుల కార్పొరేషన్లకు త్వరలోనే నిధులు కేటాయిస్తామని, వారి విధుల విషయంలో కూడా స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ బీసీ కులాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, వీటి ద్వారా ఆయా కులాల అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని వెల్లడించారు. పెరిక కుల కార్పొరేషన్ చైర్మన్‌గా దొంగరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా బుడగం శ్రీనివాస్‌లు హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో శుక్రవారం పదవీ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ముఖ్య అతిథిగా మాట్లాడారు. బీసీ కార్పొరేషన్, బీసీ సంక్షేమ శాఖ ద్వారా వివిధ కార్యక్రమాలు



అమలు చేస్తూనే వివిధ కుల కార్పొరేషన్ల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. అన్ని కార్పొరేషన్లకు తప్పక నిధులు కేటాయిస్తామని, వారు ఆ నిధులను ఎలా ఖర్చు చేయాలి, కార్పొరేషన్ బాధ్యతలు ఏమిటి అనే విషయంలో స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో పెరిక కులం అందరికీ ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలు చేస్తున్నదని అభినందించారు. సమైక్యంగా ఉండడంతోపాటు 50 ఏళ్లకు పైగా విద్యార్థుల కోసం హాస్టల్ నిర్వహిస్తున్నదని, కొత్తగా బాలికల హాస్టల్ కూడా నిర్మిస్తుండడం గొప్ప విషయమని అన్నారు. కోకాపేటలో కూడా పెరిక కులస్తులు స్వయంగా విరాళాలతో ఆత్మగౌరవ భవనం నిర్మించుకుంటున్నారని, దీనికి తప్పక ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి, మద్దా లింగయ్య, వీర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 'మెడికవర్'లో అడ్వాన్స్‌డ్ ఐ సెంటర్ ప్రారంభం

**హైదరాబాద్, మే 15 :**

అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను మరింత విస్తరించేందుకు మెడికవర్ హాస్పిటల్ హైటెక్ సిటీ యూనిట్‌లో సమగ్ర కంటి వైద్య సేవలను అందించే అత్యాధునిక అడ్వాన్స్‌డ్ ఐ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి, సామాజిక సేవకురాలు అమల అక్కినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఐ సెంటర్‌లో కాటరాక్ట్, రెటినా, రిఫ్రాక్టివ్, కార్నియా, న్యూరోఆఫ్తాల్మాలజీ సేవలను ఒకేచోట అత్యాధునిక సాంకేతికతతో అందుబాటులోకి తీసుకొచ్చారు. నేత్ర వైద్య నిపుణుల బృందం ద్వారా ప్రపంచస్థాయి నిర్ధారణ, చికిత్స, శస్త్రచికిత్స సేవలను ఈ కేంద్రం అందించనుంది. ఈ సందర్భంగా అమల మాట్లాడుతూ ప్రజలకు అత్యాధునిక కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్న మెడికవర్ హాస్పిటల్ ప్రయత్నాన్ని అభినందించారు. కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం, సమయానికి చికిత్స పొందడం ద్వారా దృష్టి కోల్పోయే ప్రమాదాన్ని తగ్గించవచ్చని అన్నారు. కాగా, ఈ కేంద్రంలో ప్రత్యేక రెటీనా, విట్రియోరెటినల్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో రెటినా లేజర్ చికిత్సలు, ప్రీమెచ్యూర్ శిశువుల్లో వచ్చే రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ చికిత్స, డయాబెటిక్ విట్రెక్టమీ, రెటినల్ డిటాచ్‌మెంట్ శస్త్రచికిత్సలు, యువియాటిస్ నిర్వహణ, కాటరాక్ట్ శస్త్రచికిత్స అనంతర సమస్యల చికిత్సలు ఉన్నాయి. అలాగే క్లిష్టమైన కంటినర సంబంధిత సమస్యలకు న్యూరో ఆఫ్తాల్మాలజీ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. కాటరాక్ట్ చికిత్స విభాగంలో ఫేకోఎమల్సిఫికేషన్‌తో ఫోల్డబుల్ ఇంట్రా ఆక్యులర్ లెన్స్ (ఐవోఎల్) అమరిక, స్మాల్ ఇన్సిషన్ కాటరాక్ట్ సర్జరీ వంటి ఆధునిక శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు సెంటర్ సన్నద్ధమైంది. వీటి ద్వారా రోగులకు త్వరితగతిన కోలుకునే అవకాశం, మెరుగైన చూపు లభిస్తుంది. అదేవిధంగా లాసిక్, స్మైల్, పీఆర్‌కే, రిఫ్రాక్టివ్ లెన్స్ ఎక్స్ఛేంజ్, ఇంప్లాంటబుల్ కాలామర్ లెన్స్ (ఐసీఎల్), కెరటోకోనస్‌కు కార్నియల్ కొలాజెన్ క్రాస్‌లింకింగ్ (సీ 3 ఆర్) వంటి ఆధునిక రిఫ్రాక్టివ్, కార్నియా చికిత్సలు కూడా అందించనున్నారు. ఇంకా ఇంట్రావిట్రియల్ ఇంజెక్షన్లు, వైఏజీ క్యాప్సులోటమీ, పెరిఫెరల్ వైఏజీ ఇరిడోటమీ, చలేజియన్ ఇన్సిషన్ అండ్ డ్రైనేజ్, తరచూ వచ్చే చలేజియన్ సమస్యలకు ఇంట్రాలెషనల్ స్టెరాయిడ్ చికిత్సలు వంటి సమగ్ర నేత్ర వైద్య సేవలు కూడా ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయి. ఈ అడ్వాన్స్‌డ్ ఐ సెంటర్ ప్రారంభం ద్వారా తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన, అందుబాటు ధరల్లో కంటి వైద్య సేవలను అందించాలనే తమ లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం డయాబెటిస్ కారణంగా వచ్చే రెటినా సమస్యలు, కాటరాక్ట్, రిఫ్రాక్టివ్ లోపాలు, జీవనశైలి కారణమైన కంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో సమయానుకూలంగా ఆధారబద్ధమైన వైద్య సేవలను ఈ సెంటర్ ద్వారా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

- **రూ.650 కోట్ల పెట్టుబడితో భారీ ఫుడ్ ఇండస్ట్రీ**
- **దామోదరతో కలసి ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**
- **త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యమని వెల్లడి**

**సంగారెడ్డి, మే 15:**




తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ కోసం తాము పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. 1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మొదట పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబుకు పరిశ్రమల శాఖ తగిన విధంగా సెట్ అయిందని తెలిపారు. మెదక్ ప్రజలు చాలా అదృష్టవంతులని చెప్పారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సహకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.



సంపాదకీయం

# ప్రపంచానికి 'ట్రంప్' సెగ

**అస్తవ్యస్తంగా ఆర్థిక రంగం!**

**భగ్గుమంటున్న ఇంధన ధరలు**

**సామాన్యుడిపై భారాల మోత**

**ఐటీలో లేఆఫ్స్ కల్లోలం..**

**ఒరాకిల్, సిస్కో సంస్థల్లో వేలాది మంది ఇంటికి**



**ఇరాన్‌పై దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచిన అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధ భయాలు, చమురు రవాణా అంతరాయం, ముడి చమురు ధరల పెరుగుదలతో భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన దేశాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.**

భారత్‌లో ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ఈ ప్రభావం కేవలం ఇంధన రంగానికే పరిమితం కాకుండా అన్ని రంగాలపై పడనుంది. రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని అంటనున్నాయి. విమానయాన రంగం ఇప్పటికే భారమైన పరిస్థితుల్లో ఉండగా, తాజా సంక్షోభంతో మరింత కుదేలయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

**ఇంధన పొదుపు కోసం ప్రధాని నరేంద్ర మోదీ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. హైదరాబాద్ వంటి ఐటీ నగరాల్లో దీని వల్ల భారీ స్థాయిలో ఇంధన ఆదా సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో కనీసం సగం మంది వారానికి మూడు రోజులు ఇంటి నుంచే పనిచేస్తే నెలకు సుమారు రూ.140 కోట్ల విలువైన ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.**

అయితే, కరోనా సమయంలో అమలైన వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని ఇప్పుడు పూర్తిస్థాయిలో కొనసాగించేందుకు అనేక ఐటీ సంస్థలు ఆసక్తి చూపడం లేదు. ఉత్పాదకత తగ్గిపోతుందనే ఆందోళనతో కొన్ని కంపెనీలు కార్యాలయ హాజరుపై మళ్లీ దృష్టి పెడుతున్నాయి.

**ఇక ఆర్థిక ఒత్తిడితో ఐటీ రంగంలో ఉద్యోగ కోతలు కూడా మొదలయ్యాయి. ఒరాకిల్ గత నెలలో ప్రపంచవ్యాప్తంగా వేలాది ఉద్యోగులను తొలగించిన తర్వాత, ఇప్పుడు ఐఐటీలు, ఎన్ఐటీల విద్యార్థులకు ఇచ్చిన జాబ్ ఆఫర్‌లను కూడా రద్దు చేసింది. సిస్కో కూడా భారీ స్థాయిలో ఉద్యోగులను తగ్గించేందుకు సిద్ధమైంది. లింక్డ్ఇన్‌కూడా సిబ్బంది పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉద్యోగ కోతల దిశగా అడుగులు వేస్తోంది.**

ఇదిలా ఉండగా, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలు ప్రజల్లో మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పూరి "పెట్రో ధరలు పెరగవని చెప్పలేను" అని వ్యాఖ్యానించగా, ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కూడా అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ధరల పెంపు తప్పదని సూచించారు.

**నిపుణుల అభిప్రాయం ప్రకారం, కేవలం కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం వల్ల పరిస్థితి మారదు. ప్రజాప్రతినిధుల దుబారా ఖర్చులు, భారీ భత్యాలు, విదేశీ పర్యటనలు, విలాసవంతమైన ఖర్చులపై కూడా నియంత్రణ అవసరమని వారు సూచిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే ఇంధన పొదుపుతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి బలమైన మద్దతు అవసరమని అభిప్రాయపడుతున్నారు.**



# జూన్ 21న 'నీట్' రీ-ఎగ్జామ్ విద్యార్థులకు ఊరట

**ప్రశ్నపత్రం లీకేజీతో రద్దయిన పరీక్షకు కొత్త షెడ్యూల్ విడుదల**

- **గతేడాది లీక్ మాఫియాపై సీబీఐ దృష్టి**
- **వచ్చే ఏడాది నుంచి పూర్తిగా ఆన్‌లైన్ విధానం: కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్**



**న్యూఢిల్లీ, మే 15:** ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో రద్దయిన నీట్ యూజీ-2026 పరీక్షను తిరిగి నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కొత్త షెడ్యూల్‌ను ఖరారు చేసింది. జూన్ 21వ తేదీ ఆదివారం ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. మే 3న జరిగిన పరీక్షలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు తేలడంతో, దేశవ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న సుమారు 23 లక్షల మంది విద్యార్థులు ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయాల్సి ఉంది. ఈ పునర్విచారణ పరీక్ష కోసం విద్యార్థులు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, ఎటువంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన పనిలేదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు తమకు నచ్చిన పరీక్షా కేంద్రాన్ని (నగరాన్ని) ఎంచుకోవడానికి వారం రోజుల పాటు గడువు ఇస్తున్నట్లు, జూన్ 14న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని ఎన్‌టీఏ వెల్లడించింది. నీట్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలగకుండా పారదర్శకంగా పరీక్ష నిర్వహించడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. లీకేజీలకు శాశ్వత పరిష్కారంగా వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తును ఇప్పటికే సీబీఐకి అప్పగించామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వార్తలను నమ్మి విద్యార్థులు ఆందోళన చెందవద్దని, అధికారిక వెబ్‌సైట్లలో వచ్చే సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ఆయన సూచించారు. మరోవైపు, సీబీఐ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజస్థాన్‌లోని సికార్ కేంద్రంగా జరిగిన ఈ లీకేజీ వ్యవహారంలో గతేడాది కూడా అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కీలక నిందితుడు వికాస్ బివాల్ కుటుంబంలోని పలువురు సభ్యులు గతేడాది లీకైన పేపర్ల సహాయంతోనే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు సాధించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. టెన్త్, ఇంటర్ మార్కులతో పోలిస్తే నీట్‌లో అనూహ్యంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల జాబితాను సీబీఐ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. లీకైన ఒక్కో పేపర్‌ను నిందితులు సుమారు 5 లక్షల రూపాయలకు విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రారంభమైన ఈ లీకేజీ నెట్‌వర్క్ హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ వంటి పలు రాష్ట్రాలకు విస్తరించినట్లు సమాచారం.

# తమిళనాడులో 'విదేశీ' ఓట్లు

**ఇమ్మిగ్రేషన్ అధికారుల దర్యాప్తులో వెల్లడి.. పది మంది అరెస్ట్**

**చూపుడు వేలిపై ఇంకు గుర్తుతో దొరికిపోయిన వైనం..**


**ఓటర్ల జాబితా తయారీపై వెల్లువెత్తుతున్న విమర్శలు**



**చెన్నై, మే 15:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విదేశీయులు ఓటు హక్కు వినియోగించుకోవడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఎన్నికల అధికారుల కళ్లు గప్పి విదేశీ పౌరులు ఓటింగ్ లో పాల్గొన్న వైనాన్ని ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు పది మందిని అరెస్ట్ చేయగా, వీరిలో అధిక శాతం శ్రీలంకకు చెందిన వారే ఉండటం గమనార్హం. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత, భారత్ నుంచి విదేశాలకు వెళ్తున్న కొందరు ప్రయాణికుల చూపుడు వేలుపై 'ఓటింగ్ ఇంకు' గుర్తు ఉండటాన్ని చెన్నై, మధురై విమానాశ్రయాల్లోని ఇమ్మిగ్రేషన్ అధికారులు గమనించారు. విదేశీ వీసాలు, పాస్‌పోర్టులు కలిగి ఉండి కూడా భారత ఎన్నికల్లో ఎలా ఓటు వేశారనే అనుమానంతో వారిని ప్రశ్నించగా, తాము ఓటు వేసినట్లు అంగీకరించారు. దీంతో గత మంగళవారం (మే 12) నుంచి వరుస అరెస్టులు మొదలయ్యాయి. అరెస్టయిన పది మందిలో శ్రీలంకకు చెందిన రంజిని (59), సర్ఫుదీన్ (68), నీలాంతి (44), జయంతన్ (40) వంటి వారితో పాటు బ్రిటన్‌కు చెందిన అయ్యదురై (53), ఇండోనేషియాకు చెందిన టిటిన్ మరియాట్టి (47), కెనడా పౌరుడు జితేంద్రనాథ్ (38) ఉన్నారు. విదేశీ పౌరులైన వీరికి కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేయడం గమనార్హం. ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్న అధికారులు, ఈ కార్డులు జారీ చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### సర్వే ప్రక్రియపై ప్రశ్నలు

ఇటీవలే ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక తనిఖీల ద్వారా తమిళనాడులో సుమారు 74 లక్షల బోగస్ ఓట్లను తొలగించి, 28 లక్షల కొత్త ఓటర్లను చేర్చారు. ఇంత పెద్ద ఎత్తున సర్వే జరిగినప్పటికీ, విదేశీయుల పేర్లు ఓటరు జాబితాలో ఎలా కొనసాగుతున్నాయని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఓటర్ల జాబితా ప్రక్షాళన సరిగ్గా జరగలేదని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. విదేశీయుల ఓటింగ్ అంశం ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

**లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు**

**ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం**

**న్యూఢిల్లీ, మే 15:** ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: దిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68, చెన్నైలో 103.67 (2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: దిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

# ఆర్జీ కర్ హత్యాచారం కేసులో ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో అత్యాచారం, హత్య కేసులో విధినిర్వహణల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు అధికారులపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ ముగ్గురినీ సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వీరిలో అప్పటి కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయెల్, అభిషేక్ గుప్తా, మనోజ్ మఖోపాధ్యాయ్ ఉన్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఈ ఘటనను బీజేపీ ప్రధానంగా ఆర్జీ కర్ బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. బాధితురాలి తల్లికి రత్న దేబ్‌నాథ్‌కు పానిహతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్ కూడా ఇచ్చింది. ఆ నియోజకవర్గం నుంచి టీఎంసీ అభ్యర్థి తీర్థంకర్ ఘోష్‌పై రత్న దేబ్‌నాథ్ 28,836 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు.



# ఆ స్థలం ఆలయానిదే!

**భోజ్‌శాల వివాదంలో ఇండోర్ కోర్టు తీర్పు**

**సరస్వతీ దేవి విగ్రహ ఏర్పాటుకు అనుమతి**

**మసీదుకు ప్రత్యామ్నాయ స్థలం చూసుకోవాలని సూచన**

ఇండోర్, మే 15: దశాబ్దాలుగా నలుగుతున్న మధ్యప్రదేశ్‌లోని ధార్ 'భోజ్‌శాల' వివాదానికి తెరదించుతూ ఇండోర్ కోర్టు శుక్రవారం సంచలన తీర్పునిచ్చింది. వివాదాస్పదంగా మారిన ఆ స్మారక కట్టడం హిందూ దేవాలయమేనని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. అక్కడ తిరిగి వాగ్దేవి (సరస్వతి) విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు హిందూ వర్గాలకు అనుమతినిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2024లో భారత పురావస్తు శాఖ (ఏఎస్సై) సుమారు 98 రోజుల పాటు ఈ ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే నిర్వహించింది. దీనికి సంబంధించిన నివేదికను జూలై 15, 2024న కోర్టుకు సమర్పించింది. ఆ నివేదికలోని ఆధారాలను, చారిత్రక వాస్తవాలను పరిశీలించిన ధర్మాసనం.. అది ప్రాచీన సరస్వతీ క్షేత్రమేనని నిర్ధారించింది. ఈ నేపథ్యంలో, మొత్తం ఆలయ ప్రాంతాన్ని పురావస్తు శాఖ తన ఆధీనంలోకి తీసుకుని పర్యవేక్షించాలని కోర్టు ఆదేశించింది. హిందువులు వాగ్దేవి ఆలయంగా, ముస్లింలు కమల్ మౌలా మసీదుగా భావించే ఈ ప్రదేశంలో 2003 నాటి ఒప్పందం ప్రకారం ఇరు వర్గాలు వేర్వేరు రోజుల్లో ప్రార్థనలు చేసుకుంటున్నాయి. అయితే, తాజా తీర్పుతో ఆ నిబంధనలకు తెరపడింది. సదరు స్థలం ఆలయానికి



చెందినదని తేల్చిన కోర్టు.. ముస్లిం వర్గం మసీదు కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సుదీర్ఘ న్యాయపోరాటంలో ఇండోర్ బెంచ్ ఇచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.




# ఘనంగా బలరాం యాదవ్ జన్మదిన వేడుకలు

- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన
- పీఏసీ చైర్మన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజు యాదవ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శుక్రవారం రోజున శ్రీరామ్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జె. బలరాం యాదవ్ నివాసంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జన్మదిన సందర్భంగా ఆయన నివాసంలో కాంగ్రెస్ సీనియర్ లీడర్లు, కాలనీ ప్రజలు, తోటి మిత్రులు, బిల్డర్లు, బలరాం యాదవ్ ని కలిసి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, సాల్వతో సత్కరించి అనంతరం కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ లీడర్లు, కాలనీ ప్రజలు, బిల్డర్లు, బలరాం యాదవ్ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.





# బండి సంజయ్‌ని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

- బండి భగీరథను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి
- బీఆర్ఎస్ నేతల డిమాండ్..





**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** తిరుమలాయపాలెం: మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై నిష్పక్షపాత విచారణ జరగాలంటే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, నిందితుడు బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ మండల నాయకులు బిల్లగిరి ధనుంజయ్, తెట్టెలపాడు సర్పంచ్ చిర్రా నర్సమ్మ డిమాండ్ చేశారు.బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. "కేంద్ర హోం సహాయ మంత్రి కుమారుడు తన కుమార్తెపై సంవత్సరకాలంగా అత్యాచారం చేస్తున్నాడని ఓ తల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా నేటి వరకు పోలీసులు సరైన స్థాయిలో స్పందించడం లేదు. మైనర్ బాలికపై అత్యాచారం తీవ్రమైన నేరమైనప్పటికీ నిందితుడికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు."బిజెపి అధికారం చేపట్టిన నాటి నుంచి దేశవ్యాప్తంగా ఆడపిల్లలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. ఇప్పుడు స్వయానా కేంద్ర సహాయ మంత్రి కొడుకే మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడనే ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును పక్కదోవ పట్టించేందుకు బండి సంజయ్ తన పలుకుబడిని ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి" అని వారు పేర్కొన్నారు."మీడియాను, వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని, న్యాయమూర్తులను సైతం ప్రభావితం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సంజయ్ పదవిలో ఉంటే నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే బండి సంజయ్ ని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి. ఆయన పాత్రపై కూడా విచారణ జరపాలి అని డిమాండ్ చేశారు...రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు బిజెపితో చీకటి ఒప్పందం చేసుకున్నారని ఈ కేసుతో మరోసారి బట్టబయలైంది. మైనర్ బాలికపై అత్యాచారం జరిగినా తెలంగాణ మహిళా మంత్రులు స్పందించకపోవడం దుర్మార్గం. బండి సంజయ్ కి ఒక న్యాయం, సామాన్యుడికి ఒక న్యాయం సాగుతోంది" అని బిల్లగిరి ధనుంజయ్, చిర్రా నర్సమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై సీపీఐఎం తోపాటు అనుబంధ ప్రజా సంఘాలు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. వెంటనే నిందితుడిని అరెస్టు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు.

# పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి



**ఆటోకు తాడు కట్టి లాగి సీపీఐ వినూత్న నిరసన**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ నేలకొండపల్లి మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వినూత్న నిరసన చేపట్టారు. నేలకొండపల్లి సెంటర్‌లో ధర్నా నిర్వహించిన అనంతరం కర్నాటి కృష్ణయ్య భవన్ నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ఆటోకు తాడు కట్టి లాగుతూ ప్రదర్శన నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ"ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో పేద ప్రజలపై భారం మోపబోమని నమ్మబలికిన మోడీ ప్రభుత్వం, ఎన్నికలు ముగిసిన 15 రోజులకే ధరల బాదుడు మొదలుపెట్టింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలు, వాణిజ్య రంగం కోలుకోలేని విధంగా దెబ్బతింటున్నాయి. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారు" అని ధ్వజమెత్తారు.ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు పాలపాటి అశోక్, సీపీఐ కౌన్సిల్ సభ్యులు కాశబోయిన అయోధ్య, ఎస్కే సలాం, మూడు శ్రీనివాసరావు, కొండ్రుగట్టు నాగరాజు, చెన్నబోయిన వెంకన్న, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందజేసిన కార్మిక సంఘం జిల్లా కోశాధికారి కాశబోయిన అయోధ్య**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను మానుకోవాలని, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి కాశబోయిన అయోధ్య డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో ఉపాధి హామీ కార్మికులు భారీ నిరసన చేపట్టారు. అనంతరం కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ సందర్భంగా కాశబోయిన అయోధ్య మాట్లాడుతూ★ "కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వెంటనే విడుదల చేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారీ కూలీని పెంచాలి. పని ప్రదేశంలో నీడ, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు" అని విమర్శించారు. "కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోంది. కార్మికుల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు ఎస్కే సలాం, మూడు శ్రీనివాసరావు, కొండ్రుగట్టు నాగరాజు మరియు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల అరెస్టులు హేయమైన చర్య

- తెలంగాణ ఉద్యమకారుల అరెస్టులు ప్రభుత్వానికే చేటు..
- జెఏసి మాజీ కన్వీనర్ టి.యు. ఎఫ్.రాష్ట్ర మీడియా కన్వినర్ దొమ్మటి కిరణ్ కుమార్ రావు,దామరోజు వీరాచారి





**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ రావు అరెస్ట్ చేయడం హేయమైన చర్య అంటూ దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు తీవ్రంగా అన్యాయం చేసిందని వారికి అందించే ప్రభుత్వ పథకాలను అందించకపోవడం అవమానపరచడమే అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి రెండున్నర సంవత్సరాల అవుతున్న తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారులను మోసం చేసిందన్నారు. ఇలాగే వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో మరో ఉద్యమానికి నాంది పలకాల్సిందే ఉద్యమకారులారా స్వరాష్ట్రమే ధ్యేయంగా పనిచేసిన మనకు ఎలాంటి ప్రభుత్వ సంక్షేమాలు ఇప్పటి వరకు ఎలాంటి వనరులు సమకూర్చలేదు తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన ఉద్యమంలా మన హక్కుల కోసం మనం మరో ఉద్యమం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జెఏసి చేసిన పిలుపు మేరకు ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడి కార్యక్రమాన్ని 33 జిల్లాలలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులను అరెస్ట్ చేసి భగ్నం చేయడం ఎంతవరకు సమంజసం అంటూ హెచ్చరించారు. ఇది ఎంత వరకు న్యాయమని అధికార ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. మాకు రావలసిన నిధులు, నియామకాలు మాకు ఇవ్వండి. అప్పుడే సంపూర్ణ తెలంగాణ ఏర్పడినట్లు లేకపోయే మరో ఉద్యమానికి మేము సిద్ధం అని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని జెఏసి మాజీ కన్వీనర్ టి.యు. ఎఫ్.రాష్ట్ర మీడియా కన్వినర్ దొమ్మటి కిరణ్ కుమార్ రావు, దామరోజు వీరాచారి, రాష్ట్ర ప్రభుత్వని హెచ్చరించారు.

# సమాజ హితులు ఆర్యవైశ్యులు..

**మానవసేవే మాధవసేవ ఆర్యవైశ్యుల సిద్ధాంతం**



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** సమాజం మేలు కోరుకునే హితులు ఆర్యవైశ్యులని మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది, సుప్రీంకోర్టు అడ్వకేట్, రిటైర్డ్ జడ్జి, శ్రీ వాసవి సేవా సమితి జాతీయ లీగల్ అడ్వైజర్ నేరెళ్ల మాలి యాద్రి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 36 వ వార్డులో శ్రీ వాసవి సేవా సమితి నూతన జిల్లా కార్యాలయాన్ని శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. మానవసేవే మాధవసేవ అనే సిద్ధాంతాన్ని నమ్మి ఆచరణలో చూపిస్తున్న కులస్తులు ఆర్యవైశ్యులని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సూర్యాపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా ఆర్యవైశ్యుల దక్కడం ఆనందంగా ఉందన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆర్యవైశ్యుల పాత్ర వెలకట్టలేనిది అన్నారు . నిరుపేదల కష్టాలు బాధలు చూసి చదివించే మనసు ఉన్న ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందు వరుసలో ఉన్నారన్నారు. శత్రువులంటూ లేకుండా జీవనం సాగించే ఆర్యవైశ్యులు ఎందరికో ఆదర్శం అన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ తమ మతం కోసం ప్రాణాలు సైతం ఇవ్వడానికి వెనకాడ బోరని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు దేవాలయాలకు తీసుకువెళ్లాలని దీని ద్వారా భారతీయ సంస్కృతి సంప్రదాయం భవిష్యత్ తరాలకు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు చెట్లను నాటుతూ వాటిని సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కరోనా సమయంలో శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణపట్నం సంబంధించిన మందును 30 వేల కు పైగా కుటుంబాలకు అందించామని సందర్భంగా గుర్తు చేశారు. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉంటూ ఏ చిన్న సమస్య ఉన్న పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్, కే శ్రీనివాసరావు,కాంగ్రెస్ నాయకులు ఫరూక్, గౌరవ చైర్మన్ ఈగ దయాకర్ గుప్తా, జిల్లా అధ్యక్షుడు బచ్చు పురుషోత్తం, గౌరవ సలహాదారులు గోపారపు రాజు, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్, రాచకొండ శ్రీనివాస్ సహాయ కార్యదర్శులు బచ్చు శ్రీనివాస్ ,సోమ సుమన్, తప్పి అనిల్ కుమార్, కోటా శివ, కర్నాటి కృష్ణ , బొల్లం సురేష్ ,సభ్యులు కొండ అనిల్ కుమార్, శ్రీరంగం రాము, సోమ ధనుంజయ్, మనసాని నాగేశ్వరరావు,మిట్టపల్లి రమేష్, బెలిదే శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్, చందా రాజశేఖర్ , గుడిపాటి రమేష్ వెంపటి శబరినాథ్, తల్లాడ రాము,బుక్క రమేష్, బచ్చు నీరజ, తెడ్ల పల్లవి, ఉప్పలంచు కృష్ణ,మహంకాళి సోమయ్య పాల్గొన్నారు.

# రోడ్లపై పశువులను వదిలేస్తే చర్యలు

**రాజముద్ర న్యూస్, జగిత్యాల, మే, 15:** జగిత్యాల: ప్రజల భద్రత దృష్ట్యా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న పశువులు, ఇతర సంచార జంతువుల వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్ హెచ్చరించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో, రద్దీ రహదారులపై ఆవులు, ఎద్దులు, గేదెలు, కుక్కలు అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. పశువుల యజమానులు తమ జంతువులను రోడ్లపై వదిలివేయకుండా సురక్షిత ప్రదేశాల్లో కట్టివేసి పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ప్రమాదం కలిగించే విధంగా పశువులను నిర్లక్ష్యంగా రోడ్లపై వదిలేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే యజమానులపై కేసులు నమోదు చేసి, పశువులను గోశాలలకు తరలిస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

# రైతులను ఘోష పెడ్తున్న ప్రభుత్వం

## ఎకరానికి 20 క్వింటాళ్ల జొన్న పంట కొనుగోలు చేయాలని బోథ్ మండలకేంద్రంలో రైతుల మెరుపు ధర్నా...



**రాజముద్ర న్యూస్, బోథ్:** రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఘోష పెడుతుంది అని రైతుకు వాపోతున్నారు శుక్రవారం రైతులు ప్రధాన రహదారి పైన సుమారు రెండు గంటల పాటు మెరుపు ధర్నా చేశారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో వారం రోజులుగా రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు మార్కెట్ యార్డ్ లో గన్ని బస్తాల కొరత తీవ్రంగా ఉంది బయట మార్కెట్ లో గన్ని బస్తా 35 రూపాయలకు కొనుగోలు చేయాల్సి వస్తుంది .పేద రైతులు గన్ని బస్తాలు ఎప్పుడూ వస్తాయని దిగులుతో ఏదురుచూస్తున్నారు సరిపడ లారీలు అందుబాటులో లేక జొన్న బస్తాలు యార్డ్ లోనే పేరుకుపోతున్నాయి జొన్నలు ఎకరానికి 20 క్వింటాళ్ల చొప్పున జొన్నలు కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తూ రైతులతో కలిసి బీ ఆర్ ఎస్ నాయకులు ధర్నా చేశారు సంఘట స్థలం కి ఎస్ఐ పురుషోత్తం చేరుకొని రైతులకు సర్ది చెప్పారు అలాగే జిల్లా వ్యవసాయ అధికారి శ్రీదర్ ఫోన్ ద్వారా రైతులతో మాట్లాడించడం జరిగింది వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రెండు రోజుల సమయం ఇవ్వండి గన్ని బస్తాల కొరత,లారీ ల కొరత లేకుండా అలాగే ఎకరానికి 20 క్వింటాళ్ల కొనుగోలు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు . రెండు రోజులలో సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున మహా ధర్నా , రాస్తారోకో లు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో బీ అర్ ఎస్ మాజీ సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి,బోథ్ పట్టణ అధ్యక్షులు అల్లకొండ.ప్రశాంత్,లింగారెడ్డి,రైతులు నవీన్ రెడ్డి,రమేష్ రెడ్డి,మండడి శేఖన్న, పుంద్రూ నర్సారెడ్డి , సంతోష్,నవ్వ రాజు, సుధాకర్ , మండల రైతులు పాల్గొన్నారు.

## జక్కేపల్లిలో ఘనంగా 'బడిబాట'

• ప్రతి చిన్నారి బడికి రావాలి • సర్పంచ్ తంగెళ్ల లక్ష్మయ్య పిలుపు




**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కూసుమంచి మండలం జక్కేపల్లి ఎస్సీ కాలనీలో "బడిబాట కార్యక్రమం" ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తంగెళ్ల లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ తంగెళ్ల లక్ష్మయ్య మాట్లాడుతూ,, విద్య ద్వారానే పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుంది. గ్రామంలో ఏ ఒక్క చిన్నారి కూడా చదువుకు దూరం కాకూడదు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపాలి. గ్రామ అభివృద్ధికి విద్య ఎంతో కీలకం" అని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతను గ్రామస్థులకు వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ పంచాయితీ పాలకవర్గం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు.

## బెజ్జంకి వడ్ల కొనుగోలు కేంద్రంలో అవకతవకలు

సీపీఐ మండల సహాయ కార్యదర్శి సంగెం మధు



**రాజముద్ర న్యూస్, బెజ్జంకి:** బెజ్జంకి మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు దారులను చిన్న భిన్నం చేస్తున్న లీడర్లు, పైరవికుల ఆగడలు ఎక్కువ అవడం వలన సామాన్య రైతులు నష్టపోతున్నారు అని సీపీఐ మండల సహాయ కార్యదర్శి సంగెం మధు ఆరోపించారు, ఐకేపి కొనుగోలు దారులు రైతుల సీరియల్ నంబర్ ఇచ్చిన అ నంబర్ పై వేరే రైతు వడ్లను అమ్మడం సమాంజసం కాదు అలా అమ్మిన రైతుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం ఈ విషయం కొనుగోలు దారులకు తెల్సిన కూడా పట్టించ్చుకోవడం లేదు, సామాన్య రైతుల పోసి చాలా రోజుల ఐనా వారి వడ్లు పోకపోవడం చాలా బాధాకరం, వెనుక కోసిన రైతుల పంట ముందుగా పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేసిన పట్టించుకోవడం లేదు, ఐకేపి కొనొగులు దారులు రాసిన ఇచ్చిన లిస్ట్ బహిర్గతం చేసి పేద రైతులను ఆదుకోవాలి, కొనుగోలు దారుల వైఖరి మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చెపడ్తామని మరియు లేనిపక్షంలో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు

## నూతన మండల అధ్యక్షుడిని సన్మానించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**రాజముద్ర న్యూస్, బెజ్జంకి:** బెజ్జంకి మండలం కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన లింగాల శ్రీనివాస్ ను మానకొండూరు శాసనసభ్యులు ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శాలువాతో సన్మానించారు.హైదరాబాద్ గాంధీభవన్ లో ఎమ్మెల్యే నూతన అధ్యక్షులను శాలువాతో సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,మాజీ మండల అధ్యక్షులు రత్నాకర్ రెడ్డి,మాజీ టెంపుల్ చైర్మన్ జెల్ల ప్రభాకర్ ,బైర సంతోష్, శానకొండ శరత్, రావుల నరసయ్య, బొనగం రమేష్, సంపత్ రెడ్డి,ఇష్కిళ్ళ ఐలయ్య,కర్రవుల సందీప్,బొనగిరి ప్రభాకర్, బోనగిరి శ్రీనివాస్,జంగిటి శంకర్,గుండని ఎల్లయ్య,గుబిరే చంద్రం తదితరులు పాల్గొన్నారు

## గన్నేరువరం బిఆర్ఎస్ పార్టీ

మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జన్మదిన వేడుకలు



**రాజముద్ర న్యూస్, గన్నేరువరం :** గన్నేరువరం మండల కేంద్రంలో శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి రసమయి బాలకిషన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద హమాలి కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పండ్లు అందజేశారు ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## నేరాల నియంత్రణకు సిసి కెమెరా లు కీలకం



ఎస్సై తిరుపతి

**రాజముద్ర న్యూస్, బెజ్జంకి:** సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాల్ చేపట్టిన "సురక్షా నేత్ర" కార్యక్రమంలో భాగంగా వడ్లూర్,తోటపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బెజ్జంకి ఎస్సై తోట తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని, నేరాల నియంత్రణ కు సిసి కెమెరాలు దోహదపడతాయని తెలిపారు. "ఒక్క కెమెరా 100 మంది పోలీసులతో సమానం." సీసీ కెమెరాలు ఉండటం వల్ల నేరాలను త్వరిత గతిన గుర్తించడం, నిందితులను సులభంగా గుర్తించడం, అలాగే నేరాల నివారణలో ఎంతో సహాయపడుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా కెమెరాల సంరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే యువత డ్రగ్స్ జోలికి వెళ్ల వద్దని సూచిస్తూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తాయని హెచ్చరించారు.కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పెద్దలు, దాతలు మరియు గ్రామ ప్రజలకు, అలాగే వడ్లూర్ మరియు తోటపల్లి గ్రామ సర్పంచులకు బెజ్జంకి ఎస్సై ప్రత్యేక అభినందనలు తెలిపారు. "సురక్షా నేత్ర" కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు అభినందిస్తూ, గ్రామాలను సురక్షితంగా మార్చేందుకు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత సభ్యత్వ ఫీజులు చెల్లించిన సర్పంచ్ రాజేంద్రప్రసాద్

**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, విద్యా వారోత్సవాల సందర్భంగా కేశవపట్నం గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ దినోత్సవాన్ని సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంచార్జీ ఎంపీడీవో కె. ప్రభాకర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని విజయం సాధించాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయం దేవాలయం వంటిదని, ప్రతి విద్యార్థి ప్రతిరోజూ గ్రంథాలయాన్ని సందర్శించి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా తనవంతుగా పది శాశ్వత గ్రంథాలయ సభ్యత్వాల ఫీజును చెల్లించి విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రాఘవరెడ్డి, కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ మాధవి, గ్రంథాలయ సూపర్వైజర్ సంపత్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఉపసర్పంచ్ విజయ్ కుమార్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఖుర్బానీ జంతువుల రవాణాకు భద్రత కల్పించాలి



• దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
• కోరుట్ల ఎంఐఎం నాయకులు

**రాజముద్ర న్యూస్, జగిత్యాల, మే 15:** బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ కోసం చట్టబద్ధంగా తరలించే జంతువుల రవాణాకు పూర్తి భద్రత కల్పించాలని కోరుతూ కోరుట్ల ఎంఐఎం నాయకులు కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 28న బక్రీద్ పండుగ జరగనున్న నేపథ్యంలో ముస్లిం ప్రజలు సంప్రదాయం ప్రకారం ఖుర్బానీ నిర్వహించేందుకు అనుమతించబడిన బఫెలో ఎద్దులు, మేకలు, గొర్రెలను రవాణా చేస్తారని తెలిపారు. ప్రతి సంవత్సరం కొందరు వ్యక్తులు "గోమాత" పేరుతో అపార్థం చేసుకుని జంతువులను అడ్డుకోవడం, ముస్లింలపై దాడులకు పాల్పడడం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత చట్టాల ప్రకారం అనుమతించబడిన జంతువులనే ఖుర్బానీ కోసం వినియోగిస్తున్నప్పటికీ, కొందరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈసారి ముందస్తు చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. ఖుర్బానీ జంతువుల రవాణా సమయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, అక్రమంగా అడ్డుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే స్లాటర్ హౌస్ పరిసరాలను మున్సిపాలిటీ తరఫున శుభ్రపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం అధ్యక్షుడు ఎండి రఫీ, ప్రధాన కార్యదర్శి వాజిద్, నాయకులు రషీద్, రహీల్, చంద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై పశువులు వదిలితే కఠిన చర్యలు

మూడు ఆవులను తాటిపల్లి గోశాలకు తరలించిన పోలీసులు

**రాజముద్ర న్యూస్, ధర్మపురి, మే, 15:** ధర్మపురి: పట్టణంలో రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న పశువుల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మపురి పోలీసులు, మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ దృష్ట్యా పశువులను రోడ్లపై వదలకుండా యజమానులు తమ ఇళ్ల వద్దనే కట్టివేయాలని ఇప్పటికే పలుమార్లు సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చాలా మంది యజమానులు స్పందించి తమ పశువులను సంరక్షించుకోగా, కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మూడు ఆవులు ప్రధాన రహదారులపై స్వేచ్ఛగా తిరుగుతూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై వెంటనే స్పందించిన పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా చర్యలు చేపట్టి ఆ మూడు ఆవులను సురక్షితంగా తాటిపల్లి గోశాలకు తరలించారు. సంబంధిత యజమానులపై చట్టపరమైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇకపై రోడ్లపై ఒంటరిగా తిరిగే పశువులు కనిపిస్తే వాటిని స్వాధీనం చేసుకుని గోశాలలకు తరలించడంతో పాటు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసు, మున్సిపల్ అధికారులకు సహకరించాలని ధర్మపురి ఎస్ఐ జి. మహేష్ కోరారు.





# అర్ష్‌దీప్ వ్యాఖ్యలపై దుమారం

**ధర్మశాల, మే 15 :** భారత క్రికెటర్ అర్ష్‌దీప్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ముంబై జట్టు బ్యాటర్ తిలక్ వర్మపై అర్ష్‌దీప్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. హోటల్‌లో జరిగిన ఈ ఘటనపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వైరల్ అవుతున్న వీడియోలో అర్ష్‌దీప్, అటుగా వెళ్తున్న తిలక్ వర్మను సరదాగా పిలుస్తూ మాట్లాడినట్లు కనిపిస్తోంది. ఇద్దరూ కొద్దిసేపు నవ్వుకుంటూ మాట్లాడుకున్నప్పటికీ, అర్ష్‌దీప్ ఉపయోగించిన పదజాలంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మాట్లాడిన తీరు వర్ణవివక్షను సూచించేలా ఉందని సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది నెటిజన్లు అర్ష్‌దీప్ వ్యాఖ్యలు సరదాగా చేసినవేనని చెబుతుండగా, మరికొందరు మాత్రం ప్రజా వేదికలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు. ప్రముఖ క్రీడాకారులు మాట్లాడే ప్రతి మాట అభిమానులపై ప్రభావం చూపుతుందని, అందువల్ల మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ సామాజిక మాధ్యమాల్లో తరచూ సరదా వీడియోలు, చిన్న చిన్న దృశ్యాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. అయితే ఈసారి తిలక్ వర్మతో జరిగిన సంభాషణ వివాదాస్పదంగా మారడంతో క్రికెట్ అభిమానుల మధ్య పెద్ద ఎత్తున చర్చ కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ అంశంపై అర్ష్‌దీప్ సింగ్ గానీ, తిలక్ వర్మ గానీ అధికారికంగా స్పందించలేదు.

# ఆకాశ్ అంబానీకి తగిలిన ఫోన్



**ధర్మశాల, మే 15 :** ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ధర్మశాలలో జరిగిన ముంబై ఇండియన్స్ – పంజాబ్ కింగ్స్ మ్యాచ్ అనంతరం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ముంబై ఇండియన్స్ విజయం తర్వాత జట్టు యజమాని ఆకాశ్ అంబానీ మైదానంలో అభిమానులతో కలిసి సందడి చేస్తుండగా, ఒక అభిమాని చేతిలోని ఫోన్ అదుపుతప్పి నేరుగా ఆయన ముఖానికి బలంగా తగిలింది. ముంబై విజయం తర్వాత స్టేడియంలో అభిమానులు సెల్ఫీల కోసం ఒక్కసారిగా ముందుకు రావడంతో అక్కడ తోపులాట పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఒక భారీ మొబైల్ ఫోన్ ఎగిరివచ్చి ఆకాశ్ అంబానీ ముఖానికి బలంగా తాకింది. ఒక్కసారిగా షాక్‌కు గురైన ఆయన నొప్పితో అక్కడే ఆగిపోయినట్లు కనిపించారు. ఈ ఘటనతో కొద్దిసేపు వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఫోన్ తగలడంతో ఆకాశ్ అంబానీ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు అక్కడున్నవారు తెలిపారు. పరిస్థితిని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆయన చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేశారు. తన వల్లే ఈ ఘటన జరిగిందని గుర్తించిన అభిమాని వెంటనే క్షమాపణలు కోరాడు. మిగిలిన అభిమానులు కూడా సారీ చెబుతూ పరిస్థితిని చల్లార్చే ప్రయత్నం చేశారు. అభిమానులు కావాలని చేయలేదని అర్థం చేసుకున్న ఆకాశ్ అంబానీ తర్వాత శాంతించారు. అనంతరం మళ్లీ అభిమానులతో కలిసి నవ్వుతూ సెల్ఫీలు దిగడం అక్కడున్నవారిని ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. 201 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో బంతి మిగిలి ఉండగానే ఛేదించి ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ముఖ్యంగా తిలక్ వర్మ తన ధాటైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 33 బంతుల్లోనే 75 పరుగులు చేసి మ్యాచ్‌ను ముంబై వైపు తిప్పేశాడు. తన ఈ ఇన్నింగ్స్‌ను రోహిత్ శర్మకు అంకితం ఇవ్వడం అభిమానులను మరింత ఆకట్టుకుంది.

# ఐపీఎల్‌కు రికార్డు స్థాయి వ్యూయర్‌షిప్




**ముంబై, మే 15 :** ఐపీఎల్ 2026 సీజన్ క్రికెట్ అభిమానులను అలరించడమే కాకుండా, ప్రసార రంగంలో కూడా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ ఏడాది టోర్నీకి డిజిటల్, టెలివిజన్ మాధ్యమాల్లో భారీ స్థాయిలో ఆదరణ లభిస్తున్నట్లు జియో హాట్‌స్టార్ వెల్లడించింది. కంపెనీ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, గత సీజన్‌తో పోలిస్తే ఈసారి డిజిటల్ వ్యూయర్‌షిప్ దాదాపు 15 శాతం పెరిగింది. ఇప్పటివరకు ఐపీఎల్ మ్యాచ్‌లకు మొత్తం 1.1 బిలియన్లకు పైగా డిజిటల్ వ్యూస్ నమోదయ్యాయి. ఇది ఐపీఎల్ చరిత్రలోనే ఒక కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ప్రస్తుతం యువత ఎక్కువగా మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, స్మార్ట్ పరికరాల ద్వారా మ్యాచ్‌లను వీక్షిస్తోంది. ఎక్కడైనా, ఎప్పుడైనా మ్యాచ్‌లను చూసే సౌకర్యం ఉండటంతో డిజిటల్ స్ట్రీమింగ్‌కు భారీ ఆదరణ పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు టెలివిజన్ మాధ్యమం కూడా తన ప్రాధాన్యతను నిలబెట్టుకుంది. ఈ సీజన్‌లో టీవీ వీక్షకుల సంఖ్య 500 మిలియన్ల మార్కును దాటినట్లు వెల్లడించారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులు కలిసి ఇంట్లో టీవీల్లో మ్యాచ్‌లను వీక్షించడాన్ని ఇంకా కొనసాగిస్తున్నారని ప్రసార సంస్థలు పేర్కొంటున్నాయి. డిజిటల్, టీవీ రెండింటిలోనూ ఏకకాలంలో భారీ ఆదరణ రావడం వల్ల ఐపీఎల్ బ్రాండ్ విలువ మరింత పెరిగినట్లు మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వీక్షించబడే క్రీడా లీగ్‌లలో ఐపీఎల్ మరోసారి తన స్థానాన్ని బలంగా నిలబెట్టుకుందని వారు చెబుతున్నారు. ప్రతి సీజన్‌తో కొత్త రికార్డులు సృష్టిస్తూ వస్తున్న ఐపీఎల్, కేవలం క్రికెట్ టోర్నీగానే కాకుండా ప్రపంచస్థాయి వినోద వేదికగా కూడా రూపాంతరం చెందిందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చెన్నైకి లక్నో పంచ్!

ఏడు వికెట్ల తేడాతో సూపర్ కింగ్స్ ఘోర పరాజయం
చెలరేగిన మిచెల్ మార్ష్..
కష్టాల్లో ప్లేఆఫ్ అవకాశాలు

**ఐపీఎల్ టోర్నీలో చెన్నై సూపర్ కింగ్స్ కు భారీ షాక్ తగిలింది. పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో ఏడు వికెట్ల తేడాతో పరాజయాన్ని మూటగట్టుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత ఓవర్లలో 187 పరుగులు చేయగా.. లక్నో బ్యాటర్లు కేవలం 16.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించారు. ఈ ఓటమితో చెన్నై ప్లేఆఫ్ ఆశలు తీవ్ర సంక్లిష్టంగా మారాయి.**







**లక్నో, మనసులో మాట:** ఎకానా క్రికెట్ స్టేడియం బి గ్రౌండ్ వేదికగా శుక్రవారం జరిగిన ఉత్కంఠ పోరులో చెన్నై సూపర్ కింగ్స్ పై లక్నో సూపర్ జెయింట్స్ అద్భుత విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. అనంతరం 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో జట్టు కేవలం 16.4 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. ఏకంగా 20 బంతులు మిగిలి ఉండగానే లక్నో గెలుపొందడం విశేషం. పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో ఉన్న లక్నో ఈ విజయంతో ఊరట పొందగా.. చెన్నై మాత్రం తీవ్ర నిరాశలో కూరుకుపోయింది.

## కార్తీక్ శర్మ ఒంటరి పోరాటం..

టాస్ గెలిచిన లక్నో జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో చెన్నై బ్యాటింగ్ కు దిగింది. ఓపెనర్ కార్తీక్ శర్మ ఆరంభం నుంచే ధాటిగా ఆడాడు. కేవలం 42 బంతుల్లోనే 71 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించే ప్రయత్నం చేశాడు. మిగతా టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. చివర్లో శివమ్ దూబె 16 బంతుల్లో అజేయంగా 32 పరుగులు, డెవాల్డ్ బ్రెవిస్ 16 బంతుల్లో 25 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో చెన్నై గౌరవప్రదమైన స్కోరు సాధించగలిగింది. లక్నో బౌలర్లలో ఆకాశ్ సింగ్ అద్భుతంగా బౌలింగ్ చేసి నాలుగు ఓవర్లలో 26 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ షమీ, షాబాజ్ అహ్మద్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

## మార్ష్ విధ్వంసకర ఇన్నింగ్స్..

భారీ లక్ష్య ఛేదనలో లక్నో బ్యాటర్లు ఎక్కడా తడబడలేదు. ముఖ్యంగా మిచెల్ మార్ష్ చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 38 బంతుల్లోనే 90 పరుగులు చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. అతడికి తోడుగా జోష్ ఇంగ్లిస్ 32 బంతుల్లో 36 పరుగులు సాధించాడు. చివర్లో నికోలస్ పూరన్ 17 బంతుల్లో అజేయంగా 32 పరుగులు చేసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. చెన్నై బౌలర్లు ఏ దశలోనూ లక్నో బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. ముకేశ్ చౌదరి ఒక వికెట్, స్పెన్సర్ జాన్సన్ ఒక వికెట్ మాత్రమే తీశారు. నూర్ అహ్మద్ తన నాలుగు ఓవర్ల కోటాలో 21 పరుగులిచ్చి పొదుపుగా బౌలింగ్ చేసినా వికెట్ దక్కలేదు.

## సంక్లిష్టంగా చెన్నై ప్లేఆఫ్ దారులు..

ఈ పరాజయంతో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్ అవకాశాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం ఆ జట్టు 12 మ్యాచ్ లాడి ఆరు విజయాలు, ఆరు ఓటములతో 12 పాయింట్లు సాధించి ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు నెట్ రన్ రేట్ ప్లస్ 0.027 గా ఉంది. మరోవైపు ఆర్ సీ బీ, గుజరాత్ టైటాన్స్ జట్లు చెరో 16 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో ఉండి దాదాపు ప్లేఆఫ్ బెర్తులను ఖాయం చేసుకున్నాయి. సన్ రైజర్స్ 14 పాయింట్లు, పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లు సాధించి చెన్నై కంటే ముందున్నాయి. రాజస్థాన్ రాయల్స్ కేవలం 11 మ్యాచ్ లు మాత్రమే ఆడి 12 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. చెన్నై మిగిలి ఉన్న రెండు మ్యాచ్ లలో గెలిచినా గరిష్టంగా 16 పాయింట్లకు మాత్రమే చేరుకుంటుంది. ఇప్పటికే రాజస్థాన్ చేతిలో ఇంకా మూడు మ్యాచ్ లు ఉండటంతో ఆ జట్టు సునాయాసంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంది. సన్ రైజర్స్, పంజాబ్ కింగ్స్ జట్లు కూడా చెన్నై పాలిట అడ్డంకిగా మారాయి. చెన్నై ప్లేఆఫ్ చేరాలంటే మిగిలిన రెండు మ్యాచ్ లలో భారీ తేడాతో తప్పక గెలవడంతో పాటు.. రాజస్థాన్, పంజాబ్, సన్ రైజర్స్ జట్లు తమ తదుపరి మ్యాచ్ లలో ఘోరంగా ఓడిపోవాలని ప్రార్థించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంతులు మిగిలి ఉండగానే లక్నో చేతిలో ఓడిపోవడం చెన్నై రన్ రేట్ పై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది.

# హీరోలు ఆటకు అవసరమే: ద్రవిడ్

**ముంబై, మే 15:** భారత క్రికెట్ జట్టులో సూపర్ స్టార్ సంస్కృతిని తగ్గించాలనే ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆలోచనలతో మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ విభేదించాడు. ఏ క్రీడకైనా హీరోలు చాలా అవసరమని, వారి ప్రదర్శనలే భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశాడు. 2024 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ను విజేతగా నిలిపిన తర్వాత కోచ్ పదవి నుంచి తప్పుకున్న ద్రవిడ్, తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత క్రికెట్‌లో సూపర్ స్టార్ల ప్రాధాన్యతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. “ఏ ఆటకు అయినా హీరోలు అవసరం. మైదానంలో అసాధారణ ప్రదర్శనలు చేయకుండా ఎవరూ హీరోలు కాలేరు. ముఖ్యంగా భారతదేశంలో ఆటగాళ్లు ప్రశంసలతో పాటు తీవ్ర విమర్శలు, ఒత్తిడిని కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటన్నింటిని తట్టుకుని జట్టుకు విజయాలు అందించినప్పుడే ఒక ఆటగాడు లెజెండ్‌గా, సూపర్ స్టార్‌గా ఎదుగుతాడు” అని ద్రవిడ్ పేర్కొన్నారు. గంభీర్ అమలు చేయాలనుకుంటున్న “జట్టే ముఖ్యమని, వ్యక్తిగత స్టార్‌డమ్ అవసరం లేదనే” భావజాలానికి భిన్నంగా ద్రవిడ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇదే సమయంలో భారత టెస్టు జట్టు ఇటీవల ఆశించిన స్థాయిలో రాణించకపోవడంపై కూడా ద్రవిడ్ స్పందించారు. “విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ వంటి దిగ్గజ ఆటగాళ్లు తప్పుకోవడంతో వారి లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అలాంటి ఆటగాళ్ల స్థానాన్ని వెంటనే భర్తీ చేయడం చాలా కష్టం. అయినప్పటికీ భారత క్రికెట్ బలంగానే ఉంది. కొంత సమయం పట్టినా జట్టు మళ్లీ పుంజుకుంటుందని నాకు నమ్మకం ఉంది” అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత క్రికెట్ షెడ్యూల్‌పై కూడా ద్రవిడ్ ఆందోళన వ్యక్తం చేశారు. “ఇప్పటి ఆటగాళ్లు ఒకేసారి అన్ని ఫార్మాట్లలో



ఆడుతున్నారు. పరిమిత ఓవర్ల క్రికెట్ ఎక్కువగా ఉండటంతో టెస్టు సిరీస్‌లకు సిద్ధమయ్యే సమయం వారికి సరిపోవడం లేదు. ఇది ఆటగాళ్ల తప్పు కాదు. ప్రస్తుత క్రికెట్ వ్యవస్థ అలాంటిదిగా మారింది'' అని వ్యాఖ్యానించారు. రెడ్ బాల్ క్రికెట్ పట్ల యువ ఆటగాళ్లలో ఆసక్తి ఉన్నప్పటికీ, విపరీతమైన మ్యాచ్‌ల ఒత్తిడి కారణంగా పూర్తి స్థాయిలో టెస్టులకు సిద్ధం కాలేకపోతున్నారని ద్రవిడ్ అభిప్రాయపడ్డారు.

# పాక్ క్రికెట్‌కు ఐసీసీ ‘డబుల్ షాక్’

పాయింట్ల కోత, భారీ జరిమానా
బంగ్లాదేశ్ చేతిలో చారిత్రక ఓటమి..
స్లో ఓవర్ రేట్‌తో కోలుకోలేని దెబ్బ
బంగ్లాకూ తప్పని పెనాల్టీ



**రావల్పిండి, మే 15:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం అత్యంత దారుణమైన కాలాన్ని ఎదుర్కొంటోంది. మైదానంలో వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న ఆ జట్టుకు, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీసుకున్న కఠిన నిర్ణయాలు మరో గట్టి దెబ్బ తీశాయి. రావల్పిండి వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసిన పాక్‌కు, క్రమశిక్షణారాహిత్యం కారణంగా ఐసీసీ భారీ జరిమానా విధించింది. నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయనందుకు (స్లో ఓవర్ రేట్) మ్యాచ్ రిఫరీ రంజన్ మదుగల్లె పాకిస్థాన్ జట్టుపై తీవ్ర చర్యలు తీసుకున్నారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో పాక్‌కు ఏకంగా 8 పాయింట్ల కోత విధించారు. ఇప్పటికే పట్టికలో దిగువన ఉన్న పాకిస్థాన్‌కు, ఈ నిర్ణయం కోలుకోలేని దెబ్బగా మారింది. దీనివల్ల ఆ జట్టు ఫైనల్ రేసులో నిలవడం మరింత సంక్లిష్టంగా మారింది. పాయింట్ల కోతతో పాటు, ఐసీసీ ప్రవర్తనా నియమావళి ప్రకారం ఆటగాళ్లందరికీ వారి మ్యాచ్ ఫీజులో 30 నుండి 40 శాతం వరకు జరిమానా విధించారు.

## బంగ్లాదేశ్‌కూ షాక్:

పాకిస్థాన్‌పై చారిత్రక విజయం సాధించి సంబరాల్లో ఉన్న బంగ్లాదేశ్ జట్టుకు కూడా ఐసీసీ షాక్ ఇచ్చింది. ఆ జట్టు కూడా మూడు ఓవర్ల స్లో ఓవర్ రేట్ నమోదు చేయడంతో, 3 డబ్ల్యూటీసీ పాయింట్ల కోతతో పాటు 15 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా కట్టాలని ఆదేశించింది. సొంతగడ్డపై బంగ్లాదేశ్ చేతిలో టెస్టుల్లో ఓడిపోవడం పాకిస్థాన్ చరిత్రలో ఇదే తొలిసారి. ఒకవైపు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో వైఫల్యం, మరోవైపు మైదానంలో సమయాన్ని వృధా చేయడం వంటి చర్యలు ఆ జట్టు ప్రతిష్టను దిగజార్చుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కెప్టెన్ షాన్ మసూద్ తన వ్యూహాలను మార్చుకోకపోతే, టెస్ట్ ఛాంపియన్‌షిప్ రేసు నుంచి పాక్ పూర్తిగా నిష్క్రమించే ప్రమాదం పొంచి ఉంది.

# థియేటర్ వివాదానికి ముగింపు దిశగా అడుగులు

**హైదరాబాద్, మే 15:** తెలుగు సినీ పరిశ్రమలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న థియేటర్ల పర్సంటేజీ విధాన వివాదానికి పరిష్కారం దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాల మధ్య నెలకొన్న విభేదాలను చర్చల ద్వారా ముగించేందుకు తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ముందుకొచ్చింది. చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు డి. సురేశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో అగ్ర నిర్మాతలు, థియేటర్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా పర్సంటేజీ షేరింగ్ విధానం, థియేటర్ల నిర్వహణ ఖర్చులు, వర్చువల్ ప్రింట్ ఫీజు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం 15 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఐదుగురు నిర్మాతలు, ఐదుగురు డిస్ట్రిబ్యూటర్లు, ఐదుగురు ఎగ్జిబిటర్లకు ప్రాతినిధ్యం కల్పించారు. ఈ కమిటీ రెండు నెలల పాటు అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి తమ తుది నివేదికను వాణిజ్య మండలికి సమర్పించనుంది. సమావేశం అనంతరం నిర్మాత సి. కళ్యాణ్ మాట్లాడుతూ పరిశ్రమ ప్రయోజనాల కోసం అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారని తెలిపారు. రాబోయే రెండు నెలల్లో ఈ సమస్యకు పూర్తి స్థాయి పరిష్కారం లభిస్తుందని, అప్పటివరకు కొత్త సినిమాల విడుదలలు, థియేటర్ల ప్రదర్శనలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కీలక సమావేశంలో అల్లు అరవింద్, దిల్ రాజు, చదలవాడ శ్రీనివాసరావు, సుప్రియ యార్లగడ్డ, స్రవంతి రవికిషోర్, మైత్రీ రవి, రాధామోహన్, చెరుకూరి సుధాకర్, భోగవల్లి బాపినీడు, సాహు గారపాటి, సతీష్ కిలారు, సూర్యదేవర నాగవంశీ, ఎస్‌కేఎన్, రాజేష్ దండా, ధీరజ్ మొగిలినేని తదితర ప్రముఖ నిర్మాతలు పాల్గొన్నారు. అలాగే థియేటర్ ఎగ్జిబిటర్ల సంఘం తరఫున విజయేందర్ రెడ్డి, శ్రీధర్ సహా పలువురు ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా టాలీవుడ్‌లో కొత్త థియేట్రికల్ విధానానికి రూపురేఖలు సిద్ధమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.








# ‘నాగబంధం’లో అనసూయ పవర్‌ఫుల్ లుక్

**హైదరాబాద్, మే 15:** టాలీవుడ్ యువ హీరో విరాట్ కర్ణ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ఫాంటసీ థ్రిల్లర్ ‘నాగబంధం’ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది. ఐశ్వర్య మీనన్, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా నటి అనసూయ భరద్వాజ్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో అనసూయ గంభీరమైన, మిస్టరీతో నిండిన పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆమె లుక్‌లో కనిపిస్తున్న తీవ్రత, ప్రత్యేకమైన శైలి సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఫాంటసీ మరియు థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రంలో విరాట్ కర్ణ ఒక విభిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పోస్టర్లు సినిమాలోని భారీ విజువల్స్ మరియు సాంకేతిక విలువలను ప్రతిబింబిస్తున్నాయి. అనసూయ కీలక పాత్రలో నటిస్తుండటం సినిమాకు మరింత ఆకర్షణగా మారింది. కథలో ఆమె పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. జూలై 3న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# పెద్ది ప్రమోషన్లలో కొత్త ఎమోషన్




## బుచ్చిబాబును లాంగ్ డ్రైవ్ తీసుకెళ్లిన రామ్‌చరణ్

రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ప్రమోషన్ల స్పీడ్ పెంచింది. సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు సరికొత్తగా ప్లాన్ చేస్తోంది. తాజాగా హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు ప్రచారంలో భాగంగా ఒక ప్రత్యేకమైన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అయితే ఇది మామూలు ఇంటర్వ్యూలా కాకుండా, రామ్ చరణ్ స్వయంగా కారు డ్రైవ్ చేస్తూ బుచ్చిబాబును ఒక షికారుకి తీసుకెళ్లారు. ప్రయాణంలోనే వీరిద్దరూ సినిమా ముచ్చట్లను పంచుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. సినిమా పనులతో ఇంత బిజీగా ఉన్నప్పటికీ, నన్ను ఇలా లాంగ్ డ్రైవ్‌కు తీసుకువచ్చినందుకు థాంక్యూ చరణ్ సార్ అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. దానికి చరణ్ స్పందిస్తూ.. ‘అదంతా సరే కానీ, మన 'పెద్ది' సినిమా ఎప్పుడు వస్తుందో ప్రేక్షకులకు కచ్చితంగా చెప్పు‘ అని నవ్వుతూ అడిగారు. దీంతో వీరిద్దరూ కలిసి జూన్ 4న 'పెద్ది' సినిమా థియేటర్లలోకి వస్తోందని అధికారికంగా ప్రకటించారు. భారీ అంచనాలతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయాలని రామ్ చరణ్, బుచ్చిబాబు కోరారు



# ఆలియా వ్యాఖ్యలపై చర్చ



బాలీవుడ్ ప్రముఖ నటి ఆలియా భట్ అంతర్జాతీయ సినీ ఉత్సవ వేదికపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటికీ పురుషాధిక్యత కొనసాగుతోందని ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. సినిమాల్లో కథ కంటే హీరోలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆలియా అభిప్రాయపడ్డారు. చాలా చిత్రాలు ఇప్పటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నాయని, కథ బలంగా ఉండటమే అసలు ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. సినిమాను విజయవంతం చేసేది కేవలం హీరో కాదని, మంచి కథే ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. ఆమె వ్యాఖ్యలకు సామాజిక మాధ్యమాల్లో భిన్న స్పందనలు వస్తున్నాయి. కొందరు ఆలియా ధైర్యంగా నిజం మాట్లాడిందని ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం తీవ్ర విమర్శలు చేస్తున్నారు. భారతీయ సినిమాను తక్కువ చేసి మాట్లాడుతున్నారని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆమె భర్త నటించిన కొన్ని చిత్రాల్లో కూడా పురుషాధిక్యత కనిపించిందని, అలాంటి సినిమాలపై ఎందుకు స్పందించలేదని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమలో మార్పు గురించి మాట్లాడేవారు ముందుగా తమ చుట్టూ ఉన్న విషయాలపై స్పందించాలని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు ఆలియా చెప్పిన విషయాల్లో నిజం ఉందని పలువురు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. హీరోలకు భారీ పారితోషికాలు, ప్రత్యేక ప్రాధాన్యత, విస్తృత ప్రచారం లభిస్తున్నప్పటికీ హీరోయిన్లకు సమాన గుర్తింపు దక్కడం లేదని చర్చ జరుగుతోంది. గతంలో కూడా పలువురు నటీమణులు సినీ పరిశ్రమలో మహిళలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆలియా వ్యాఖ్యలతో మరోసారి భారతీయ సినిమాల్లో కథలకు ప్రాధాన్యత పెరగాల్సిన అవసరంపై చర్చ మొదలైంది.




# ‘దూరదర్శిని’ మూవీ రివ్యూ..

**హైదరాబాద్, మే 15 :** ప్రస్తుతం చిన్న సినిమాలు కూడా బలమైన కథతో వస్తే ప్రేక్షకులు ఆదరిస్తున్న పరిస్థితి నెలకొంది. అలాంటి కథా బలంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తాజా చిత్రం ‘దూరదర్శిని’. పేరు వినగానే 90వ దశకపు జ్ఞాపకాలను గుర్తు చేసే ఈ సినిమా నేడు థియేటర్లలో విడుదలైంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుందో ఇప్పుడు చూద్దాం. మట్టపర్రు అనే పల్లెటూరి నేపథ్యంలో సినిమా సాగుతుంది. చిన్నప్పటి నుంచి ఒకరినొకరు ఇష్టపడే హరి, వాణి ప్రేమకథ చుట్టూనే కథ తిరుగుతుంది. ప్రతి శుక్రవారం దూరదర్శనిలో వచ్చే ‘చిత్రలహరి’ కార్యక్రమం వీరిద్దరినీ మరింత దగ్గర చేస్తుంది. అయితే గ్రామంలో ఉన్న కుల రాజకీయాలు, వాణి కుటుంబ ప్రభావం వీరి ప్రేమకు అడ్డంకిగా మారతాయి. వాణి అన్నయ్య పరశురామ్‌తో హరికి జరిగిన గొడవ తర్వాత కథ ఆసక్తికర మలుపు తిరుగుతుంది. చివరకు తమ ప్రేమను వారు ఎలా గెలిపించుకున్నారు అనేదే సినిమా ప్రధానాంశం. దర్శకుడు కార్తికేయ 90వ దశకపు గ్రామీణ వాతావరణాన్ని చాలా సహజంగా చూపించారు. పల్లెటూరి జీవనం, అప్పటి టెలివిజన్ సంస్కృతి, కుటుంబ భావోద్వేగాలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. ముఖ్యంగా ‘చిత్రలహరి’ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు అప్పటి ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తాయి. తొలి భాగంలో కథనం కొంత నెమ్మదిగా సాగినా, గ్రామీణ హాస్యం మరియు భావోద్వేగ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. రెండో భాగంలో కుల వివక్ష, ప్రేమ కోసం చేసే పోరాటం వంటి అంశాలు సినిమాను మరింత బలంగా నిలబెట్టాయి. క్లైమాక్స్‌లో వచ్చే మలుపు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. హీరోగా నటించిన సువీక్షిత్ తన తొలి చిత్రంలోనే మంచి నటన కనబరిచాడు. హీరోయిన్ గీతికా రతన్ కూడా సహజ నటనతో ఆకట్టుకుంది. హీరో స్నేహితుల పాత్రల్లో కనిపించిన భద్ర, బలరామ్ హాస్యంతో అలరించారు. పరశురామ్ పాత్రలో నటించిన నటుడు తన గంభీరమైన నటనతో మెప్పించాడు. సాంకేతికంగా కూడా సినిమా బాగానే నిలిచింది. ఆనంద్ గుర్రన అందించిన నేపథ్య సంగీతం భావోద్వేగ సన్నివేశాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లింది.



పాటలు సాధారణంగా ఉన్నా, నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి. అయితే తొలి భాగంలో కొన్ని సన్నివేశాలు సాగదీతగా అనిపించడం సినిమాకు చిన్న మైనస్‌గా మారింది. మొత్తంగా చూస్తే ‘దూరదర్శిని’ పాత జ్ఞాపకాలను గుర్తు చేసే ఒక భావోద్వేగ గ్రామీణ ప్రేమకథ. ముఖ్యంగా 90వ దశకపు అనుభూతులను మళ్లీ ఆస్వాదించాలనుకునే ప్రేక్షకులకు ఈ సినిమా మంచి ఎంపికగా చెప్పొచ్చు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com